ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు: సబ్ కలెక్టర్

గరుగుబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాత్సవ హెచ్చరించారు. సోమవారం నాగావళి నదికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబరు 135లో నాలుగు ఎకరాలను గోసంరక్షణకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామన్నారు. తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధుల విన్నపం మేరకు సంబంధిత పశు సంవర్థక శాఖ అధికారులు ఇంతకముందే ఈ స్థలాన్ని పరిశీలించారని వెల్లడించారు. ఆయన వెంట డీటీ సుందరరావు, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లు ఉన్నారు.

మరువలేని దుర్ఘటనది

- ఘోర రైలు ప్రమాదం జరిగి నేటికి ఏడాది
- 14 కుటుంబాల్లో నింపిన చీకట్లు
- గాయపడ్డ మరో 60 కుటుంబాలకు ఆర్థిక కష్టాలు
- కంటకాపల్లి- అలమండ మిడ్ లైన్‌లో ప్రమాదం


జామి మండలం అలమండ గ్రామ సమీపంలో జరిగిన రైలు ప్రమాదం (ఫైల్)

శృంగవరపుకోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 2023 అక్టోబరు 29 రాత్రి 7 గంటల సమయం.. అంతవరకూ ప్రశాంతంగా ఉన్న కొత్తవలస మండలం కంటకాపల్లి, జామి మండలం అలమండ ప్రాంతాల ప్రజలు పిడుగుపాటును పోలిన భారీ శబ్దాన్ని విన్నారు. కొన్ని క్షణాల పాటు భయంతో వణికిపోయారు. కాస్త తేరుకున్నాక ఏమైందో తెలుసుకుందామని రైల్వేట్రాక్ వైపు పయనమయ్యారు. అక్కడకు వెళ్లాక చెల్లాచెదురైన మృతదేహాలు, క్షతగాత్రుల ఆర్తనాదాలు.. ధ్వంసమైన రైలు బోగీలతో భయానక వాతావరణాన్ని చూసి చలించిపోయారు. ఆ దుర్ఘటన జరిగి ఏడాదవుతోంది. ఆ ఘోరాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. బాధితులుగా మిగిలిన వారి కష్టాలు ఇంకా తీరలేదు. భర్తను కోల్పోయిన భార్య, పిల్లలు, కుమారుడు దూరమైన బాధలో తల్లిదండ్రులు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. 14 కుటుంబాల్లో కన్నీటి కష్టాన్ని నింపిన ఘోరమది. మరో 60 మందిని క్షతగాత్రులుగా మిగిల్చిన దుర్ఘటనది. కొత్తవలస మండలం కంటకాపల్లి, జామి మండలం అలమండ ప్రాంతాల ప్రజలు ఇప్పటికీ మరువలేని రైలు ప్రమాదం జరిగి నేటికి ఏడాదవుతోంది. పలాస పాసింజర్ రైలును రాయగడ పాసింజర్ రైలు బలంగా ఢీకొనడంతో ఆ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బలిజిపేట మండలం పనుకువలస గ్రామవాసి సూర్య నారాయణ , పార్వతీపురం పట్టణానికి చెందిన పార్వతి, నానాజీలతో పాటు విజయనగరం జిల్లావాసులెందరో గాయ పడ్డారు. ఎటు చూసినా చీకటితో నిండివుండడం.. ప్రమాదం జరిగిన రైలు పట్టాలకు ఆనుకుని ఇరువైపులా మామిడితోటలు, వరి పంట పొలాలు వుండడంతో సకాలంలో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. సమీప గ్రామాల ప్రజల సహకారంతో మృతదేహాలను, క్షత గాత్రులను రాత్రంతా వెతికారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన కుటుంబాలకు ఈరైలు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కూలిపనికి వెళ్లిన వారు.. మరో రెండు, మూడు గంటల్లో ఇళ్లకు చేరుకుంటారని ఎదురు చూసేవారందరికీ గుండెలను మెలిపెట్టే దుర్వార్త తెలిసింది. కొన్ని గంటల పాటు ప్రమాద స్థలం కన్నీటి మయమైంది. ఘటనాస్థలం నుంచి రెండు బోగిలను తొల గించేందుకు రెండు రోజులు, రైళ్ల పునరుద్ధరణకు ఒకరోజు సమయం తీసుకోవాల్సి వచ్చింది. ఏదేమైనా రైల్వేశాఖ ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందు బాటులోకి తీసుకొచ్చాక కూడా రైళ్లు ఢీకొనడం ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

దేవుడి దయతో..

గత ఏడాది విజయనగరం జిల్లా అలమండ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డా. రైలు ప్రమాదం జరిగి ఏడాది గడుస్తున్నా.. ఇంకా ఆ ఘటనను మర్చిపోలేక పోతున్నా. ప్రాణాలతో ఇలా ఉంటానని అనుకోలేదు. ప్రమాదంలో కాళ్లు విరిగినా చికిత్స అనంతరం కోలుకున్నా..

- మర్రాపు సూర్యనారాయణ, పనుకువలస, బలిజిపేట మండలం

పది గంటలు నరకయాతన

- పార్వతీపురం-రాయగడ రహదారిపై ట్రాఫిక్ జామ్
- గోతిలో దిగబడిన 108 వాహనం
- కాసేపటికే అదే గొయ్యిలో కూరుకుపోయిన లారీ


అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడిన ఇసుక లారీ

కొమరాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో కూనేరు నుంచి ఒడిశా రాష్ట్రం రాయగడ వైపు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి వాహనదారులకు నరకం చూపిస్తోంది. రోజూ ఏదో ఒక వాహనం గోతుల్లో కూరుకుపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం కొమరాడ నుంచి బయల్దేరిన 108 వాహనం గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడింది. భద్రగిరి వైద్యశాల నుంచి పార్వతీపురానికి రోగులను తరలించేందుకు పయనమైన ఆ వాహనం సుమారు 15 నిమిషాల పాటు అక్కడే నిలిచిపోయింది. చివరకు స్థానికుల సహాయంతో వాహనం ముందుకు కదలడంతో సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. కాగా కాసేపటి తర్వాత అదే గోతిలో ఓ ఇసుక లారీ దిగబడింది. దీంతో సుమారు పది గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుకు ఇరువైపులా సుమారు 15 కిలో మీటర్ల మేర వాహనాలు బారులుదీరాయి. చివరకు క్రేన్ సాయంతో లారీలను పక్కకు తొలగించడంతో సాయంత్రం 6 గంటల తర్వాత యథావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి. ఒడిశా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు కీలకమైన ఈ రహదారిపై అధికారులు దృష్టిసారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.


నిలిచిపోయిన వాహనాలు

మధుర ఫలం... మనకే సొంతం

- ఆరోగ్య ప్రయోజనాలు అధికం
- సీతాఫలాలకు ప్రసిద్ధి మన మన్యం

6లో

మన్యంలో లభించే సీతాఫలాల రుచే వేరబ్బా.. సేంద్రియ పద్ధతిలో పండే ఈ ఫలాల్లో ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువ. అందుకే జిల్లావాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఇదే సమయంలో వ్యాపారులు కూడా సంతలకు చేరుకుని గిరిజనుల నుంచి సేకరిస్తుంటారు. తిరిగి వాటిని పలు రాష్ట్రాలకు రవాణా చేస్తుంటారు. ఏదేమైనా పార్వతీపురం మన్యానికి సొంతమైన మధుర సీతాఫలంపై ప్రత్యేక కథనం.



ఐటీడీఏ వరకు ఎందుకు?

- గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించలేరా?
- ఇది పునరావృతమైతే క్షమించేది లేదు
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


గిరిజనుల సమస్యలు వింటున్న కలెక్టర్, ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ వరకు గిరిజనులు రావడంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటివి పునరావృతం అయితే క్షమించేది లేదని హెచ్చరించారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం సీతంపేట ఐటీడీఏలో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. రహదారులు, రక్షణ గోడలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయని కలెక్టర్ తెలి పారు. గ్రామసభ తీర్మానం మేరకు ఉపాధిహామీ పథకం కింద పనులు ప్రారంభించా లని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేయించాలని, సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏజెన్సీలో తాగునీటి అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. జలజీవన్‌మిషన్ పనుల వివరాలు అందించాలని, రోడ్ల పనుల తనిఖీలు పూర్తయిన తర్వాత మాత్రమే బిల్లుల చెల్లించాలని తెలిపారు. ఎంపీసీసీ పనులు, భామిని ఏకలవ్య పాఠశాల భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలా కాదు.. పనులు చేసి చూపుతాం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలా రాళ్లు వేసి వదిలేయం.. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి చూపుతాం' అని మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలంలో రూ.3.65 కోట్లతో నిర్మించనున్న చిన్నవలస- పుణికిలవలస, ముగడవలస-చంద్రప్పవలస, గుండ్రపువలస- ఖరాసవలస రోడ్ల నిర్మాణా లకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుండ్రప్పవలస వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'ఎన్నికల ముందు వైసీపీ వాళ్లు రోడ్లు తదితర పనులకు రాళ్లు వేసి ఎందుకు పనులు పూర్తి చేయలేకపోయారో చెప్పాలి. ఇటీవల పారమ్మకొండ రోడ్డు పనికి శంకుస్థాపన చేశా. కొద్దిరోజుల్లో పనులు పూర్తవుతాయి. ఇప్పుడు శంకుస్థాపన చేసిన పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. ఈ నాలుగు నెలల్లో సాలూరు నియోజకవర్గానికి రూ. 80 కోట్లు తెప్పించా. ప్రతి పంచాయతీలో క్రీడా మైదానాలను నిర్మిస్తాం. కొత్తవలస, ఖరాసవలసల మీదుగా త్వరలో బస్సు నడిచే విధంగా చర్యలు తీసుకుంటాం.' అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ నేతలు, సర్పంచ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గుండ్రపువలసలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన మ్యూజియంలో చోరీ

- ఏసీ యూనిట్లు, సీలింగ్ లైట్లు మాయం

సీతంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని గిరిజన మ్యూజియంలో చోరీ జరిగింది. సెంట్రల్ ఏసీ యూనిట్, లైట్లు, సీలింగ్‌ను ధ్వంసం చేశారు. అయితే ఈ విషయాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. భవనం చుట్టూ ఉన్న 14 ఏసీ ఔటర్ యూనిట్లు, మరో 3 సీలింగ్ లైట్లు కనిపించడం లేదని మ్యూజియం క్యూరేటర్ సుశీల సోమవారం తెలిపారు. అంతేగాకుండా మరికొన్ని వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించామని, ఎలక్ట్రికల్ వస్తువులకు సంబంధించి ఇంకా ఏవేవి పోయాయో గుర్తించాల్సి ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. దీనిపై ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబును వివరణ కోరగా.. గిరిజన మ్యూజియమంలో విలువైన వస్తువులు పోయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా పోలీస్ సిబ్బంది గిరిజన మ్యూజియాన్ని సందర్శించి చోరీకి గురైన వస్తువులు వివరాలను సేకరించారు.

6లో

బతికేదెలా?

- పాల సేకరణ ధర తగ్గింపుపై పాడిరైతుల అసంతృప్తి
- పెరిగిన దాణా, పశుగ్రాసం ధరలతో ఖర్చులు తడిచిమోపెడు
- విశాఖ డెయిరీ నిర్ణయంపై మరింత నష్టం

అమ్మో... బ్రెయిన్ స్ట్రోక్!

- అవగాహన లోపంతో పక్షవాతం ముప్పు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

విలీనం లేదిక!

- జీవో 117 రద్దుకు ప్రభుత్వ నిర్ణయం
- మార్పుల ప్రక్రియకు విద్యా శాఖ శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం



సాలూరు రూరల్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తరగతుల విలీనంపై వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రక్రియ ప్రారంభించింది. మూడు నెలల్లో ఆ జీవో రద్దుచేసి, కొత్త జీవోలు జారీ చేయనుంది. మొత్తంగా విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంతో జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన హామీ మేరకు...

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇటీవల జీవో 117 రద్దుపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జీవో 117ను రద్దుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు. విలీనం తరగతులను వెనక్కి తీసుకొస్తే ఏర్పడే సమస్యలపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా 3,4,5 తరగతుల విలీనం రద్దుకు అడుగులు పడుతున్నాయి. జీవో 117 రద్దుతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం రానుంది. జిల్లాలో 129 పాఠశాలలకు చెందిన 3,4,5 తరగతులు వెనక్కి రానున్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగనుంది. జీవో 53 ప్రకారం ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరగనుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు రోల్ బట్టి సబ్జెక్ట్‌ల వారీగా ఉపాధ్యాయులు రానున్నారు.

గత వైసీపీ సర్కారు హయాంలో..

గత వైసీపీ ప్రభుత్వం 2021లో జీవో 117ను వెలువరించింది. దీంతో జిల్లాలో వివిధ ఉన్నత పాఠశాలల్లో కిలోమీటరు లోపు ఉన్న 129 ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులు విలీనం చేశారు. 129 ప్రాథమిక పాఠశాలలు కేవలం 1,2 తరగతుల బోధనకే పరిమితమయ్యాయి. అప్పటి వరకు విద్యార్థులతో కళకళలాడిన ఆయా పాఠశాలలు బోసిపోయాయి.

తగ్గిన నమోదు

ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో విలీనం కావడంతో అక్కడ వసతి సమస్య ఏర్పడింది. దీంతో పలు ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతులను బోధించడానికి అక్కడ ఉన్న ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ రూంలను సైతం వినియోగించారు. విలీనంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గింది. మూడో తరగతికి కిలోమీటరు దూరం వరకు వెళ్లాల్సి రావడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపారు. దీంతో 2022లో జిల్లాలోని ప్రభుత్వ బడులకు 21 వేల మంది విద్యార్థులు దూరమైనట్లు ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మరోవైపు పలు పాఠశాలలను ఏకోపాధ్యాయులతో నిర్వహిస్తున్నారు. సాలూరు, పాచిపెంట మండలాల్లో...



-మిగతా 8వ పేజీలో..

● అవగాహన లోపంతో పక్షవాతం ముప్పు ● జిల్లాలో పెరుగుతున్న బాధితులు
● నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

అమ్మో.. బ్రెయిన్ స్ట్రోక్




విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో జిల్లాలో బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారు దీని బారిన పడుతున్నారు. శరీర అవయవాల పనితీరును నియంత్రించే మెదడు దెబ్బతినడం వల్ల కలిగే వ్యాధిని బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. మెదడులో రక్తం సరఫరా సరిగ్గా జరగకపోవడం.. రక్తనాళాలు చిట్లడం వంటి కారణాలతో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై.. పక్షవాతం బారిన పడతారు. స్ట్రోక్‌కు కారణాలు, లక్షణాలు.. నివారణపై అవగాహన పెంచడానికి ఏటా అక్టోబరు 29న ప్రపంచ స్ట్రోక్ డేని నిర్వహిస్తున్నారు. ప్రచార కార్యక్రమాల ద్వారా స్ట్రోక్ లక్షణాలను ముందుగా గుర్తించి తక్షణం వైద్య సాయం పొందడంతో నివారణ సాధ్యమన్న విషయమై అందరిలో అవగాహన కల్పించడమే స్ట్రోక్ డే లక్ష్యం.

బ్రెయిన్ స్ట్రోక్ ఇలా...

మెదడుకు సాధారణ రక్తప్రవాహంలో అంతరాయం ఏర్పడితే స్ట్రోక్ రావచ్చు. ఇస్కీమిక్ స్ట్రోక్, హెమరేజిక్ స్ట్రోక్‌లు ప్రధానంగా సంభవిస్తుంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మెదడుకు రక్త ప్రసరణలో ఆటంకం ఏర్పడినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్.. మెదడులోని రక్త దమని పగిలి రక్తస్రావమైనప్పుడు హెమరేజిక్ స్ట్రోక్‌లు సంభవిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మెదడుకు అందాల్సిన ఆక్సిజన్, పోషకాలు అందకపోయినప్పుడు అందులోని కణాలు చనిపోవడం ప్రారంభిస్తాయి. ఇది అనేక రకాల నాడీ సంబంధిత రుగ్మతలకు దారి తీస్తుంది.

ఒత్తిడితోనే అధికం..

ఈ వ్యాధి ఒకప్పుడు వృద్ధాప్యంలో ఉన్నవారికి వచ్చేది. ప్రస్తుతం 30 ఏళ్ల యువకులు కూడా దీని బారిన పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. జీవన విధానంలో మార్పులు, తీవ్రమైన ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల అనేక మంది పక్షవాతానికి గురవుతున్నారు. క్యాన్సర్, గుండె వ్యాధుల తరువాత అత్యధికంగా మరణాలకు కారణమవుతున్నది పక్షవాతమని వైద్య నిపుణులు చెబుతున్నారు. పక్షవాతంపై అవగాహన లేకపోవడంతో సమయానికి వైద్య చికిత్స అందడం లేదు. దీంతో శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారని అంటున్నారు.



జిల్లాలో పెరుగుతున్న బాధితులు

జిల్లాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నెలకు 180కి పైగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయి. వీరిలో 10 మంది వరకూ మరణిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రుల్లో బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న వారి సంఖ్య వందల్లో ఉండడం ఆందోళన కలిగించే అంశం. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల లోపు వైద్య నిపుణులను సంప్రదించి అత్యవసర చికిత్స చేయించుకోవలసి ఉంటుంది. అవగాహన లోపంతో ఆలస్యం కారణంగా చాలా మంది కాళ్లు, చేతులతో పాటు ఇతర అవయవాలు చచ్చుబడి పక్షవాతానికి గురవుతున్నారు.

స్ట్రోక్ లక్షణాలు ఇలా...

స్ట్రోక్ లక్షణాలను ఆంగ్లంలో బి.ఇ.ఎఫ్.ఎ.ఎస్.టి.గా పిలుస్తారు.

బి: బ్యాలన్స్‌లో ఇబ్బందులు
ఇ: కంటిచూపులో మార్పులు
ఎఫ్: ముఖం వంగిపోవడం
ఎ: చేయి బలహీనత
ఎస్: స్పీచ్ (మాటల్లో, తడబాటు)
టి: అత్యవసర సేవకు కాల్ చేయడానికి సమయం

ఈ లక్షణాల ద్వారా గుర్తించాలని వైద్యులు తెలుపుతున్నారు..

కారణాలు ఇవే..

- యువత ఎక్కువగా పొగ తాగడం, మద్యం తాగడం, ఇతర ప్రమాదకర మత్తు పదార్థాల వినియోగం వల్ల స్ట్రోక్‌కు గురవుతున్నారు.
- జీవన విధానంలో మార్పులు, మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం.
- స్థూలకాయం ఉన్న వారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం.
- గుండె జబ్బులు ఉన్న వారికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చును.
- పుట్టుకతో జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డ కట్టే గుణం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



స్ట్రోక్‌కు గురైన 24 గంటలు దాటిన తరువాత ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సకాలంలో చికిత్స చేయకపోవడంతో రోగి పక్షవాతానికి గురై కాలు, చేయి చచ్చుబడుతున్నాయి. కాబట్టి స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన నాలుగున్నర గంటలలోపు ఆసుపత్రికి తీసుకువస్తే నష్ట తీవ్రతను తగ్గించవచ్చును. ముఖ్యంగా పొగ తాగడం, మద్యం కారణంగా యువత స్ట్రోక్‌కు గురవుతున్నారు. కుటుంబంలో ఎవరికైనా పక్షవాతం ఉన్నట్టయితే... తప్పనిసరిగా కుటుంబ సభ్యులు తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. బ్రెయిన్ స్ట్రోక్‌కు నేడు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కానీ జాగ్రత్తలు పాటించడం ద్వారా దీని బారిన పడకుండా ఉండొచ్చు.

- డాక్టరు రెడ్డి శంకరరావు, న్యూరో సర్జన్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం

నేడు ఉయ్యాల..కంబాల ఉత్సవం

● ఏర్పాట్లు పూర్తి ● చదురుగుడి నుంచి వనంగుడికి పైడిమాంబ



విజయనగరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవంలో చివరి ఘట్టం ఉయ్యాల..కంబాల ఉత్సవం మంగళవారం జరగనుంది. దేవస్థానం అధికారులు, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉయ్యాల...కంబాల రోజు కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో సిరిమానోత్సవానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, షామియానాలను దేవస్థానం అధికారులు అలానే ఉంచారు. దీంతో భక్తులకు ఎండ నుంచి రక్షణ లభించనుంది. మంగళవారం ఉదయం 4.45 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పైడిమాంబ దర్శనానికి ఉదయం 6 గంటలకు భక్తులను అనుమతిస్తారు.. నగరంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా ఎక్కువ మంది పైడిమాంబ భక్తులు రానున్నారు.. సిరిమానోత్సవం సమయంలో వీలుకాని వారు, వేర్వేరు ప్రాంతాల్లో ఉండిపోయిన వారంతా పైడిమాంబ దర్శనానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకోనున్నారు..

వనంగుడికి పైడిమాంబ

ఏటా ఆరు నెలలు వనంగుడిలోనూ, మరో ఆరు నెలలు చదురుగుడిలో ఉండి పైడిమాంబ భక్తులకు దర్శనమివ్వనున్నారని భక్తుల నమ్మకం. ఆ ప్రకారం వైశాఖ మాసంలో పైడిమాంబను వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకొచ్చారు. సిరిమానోత్సవం, అనంతరం ఉయ్యాల... కంబాల వరకూ ఇక్కడే ఉంటారు. మంగళవారం నాటి ఉయ్యాల...కంబాల తర్వాత చదురుగుడి నుంచి పైడిమాంబను వనంగుడికి తీసుకువెళ్తారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు.

టీడీఆర్ బాండ్లపై విజి'లెన్స్'

● బొబ్బిలిలో రోజంతా దర్యాప్తు
● కొలతలు, మార్కెట్ విలువల్లో తేడాల గుర్తింపు?
● అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో గుబులు

బొబ్బిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్) బాండ్లపై విజిలెన్స్ అధికారులు సోమవారం దర్యాప్తు చేపట్టారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని కోర్టు జంక్షన్ నుంచి పోలీసు స్టేషన్ రోడ్డు మీదుగా అమ్మిగారి కోనేరు గట్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరించిన సంగతి తెలిసిందే. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రోడ్ల విస్తరణలో భవనాలు, ఖాళీ స్థలాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారానికి బదులుగా టీడీఆర్ బాండ్ల జారీ విధానాన్ని అమలు చేశారు. ఈ బాండ్లను కలిగి ఉన్న ఇళ్లు, స్థలాల యజమానులు 1:4 నిష్పత్తిలో వాటిని వినియోగించుకునే వెసులుబాటును కల్పించారు. ఎన్ని గజాలలో స్థలాన్ని కోల్పోతే... దానికి నాలుగురెట్ల విలువ గల బాండ్లను అప్పట్లో జారీ చేశారు. ఆ యజమానులు ఎక్కడైనా నిర్మాణాలు చేపడితే 1:4 ప్రాతిపదికన మున్సిపల్ ఫీజుల మినహాయింపును పొందవచ్చు. వారికి సొంతంగా నిర్మాణ పనులు లేని పక్షంలో రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరికైనా వాటిని అమ్ముకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆ తరువాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వ హయాంలో తిరుపతి, విశాఖ, నెల్లూరు, అనకాపల్లి జిల్లాలలో టీడీఆర్ బాండ్ల క్రయవిక్రయాలు, వినియోగంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అనేక చోట్ల ఈ ఆరోపణలు నిజమని తేలింది.

కూటమి ప్రభుత్వం రాకతో...

తాజాగా మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం విజిలెన్స్ అధికారులు బొబ్బిలిలో రోజంతా దర్యాప్తు నిర్వహించారు. బలిజిపేటలో రోడ్ల విస్తరణ ఏ మేరకు జరిగింది? ఎన్ని భవనాలకు టీడీఆర్ బాండ్లు జారీ చేశారు? వాటి కొలతలు ఎంత? మార్కెట్ విలువకు సరిపడా ఇచ్చారా? లేదా? అన్న విషయాలపై ఆరా తీశారు. కొలతలు, మార్కెట్ విలువల్లో తేడాలు ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. పట్టణంలో రోడ్ల విస్తరణ కోసం కూలగొట్టిన భవనాలను, అక్కడి రోడ్లను కొలతలు తీసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై రికార్డులన్నిటినీ పరిశీలించారు. బొబ్బిలిలో 208 టీడీఆర్ బాండ్లను గతంలో జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీటన్నిటిపైనా దర్యాప్తు చేపట్టి... ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా విజిలెన్స్ దర్యాప్తు నేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో గుబులు రేగుతున్నట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ జి.ప్రేమ్‌కుమార్, సీఐ బి.సింహాచలం, టౌన్ ప్లానింగ్ అధికారి రేవతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మధుర ఫలం.. మనకే సొంతం!

● ఆరోగ్య ప్రయోజనాలు అధికం
● సీతాఫలాలకు ప్రసిద్ధి మన మన్యం
● వ్యాపారులు చెప్పిందే ధర

కొమరాడ/సీతంపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో లభించే సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంది. గిరిజనులు జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వారపు సంతల్లో వీటిని విక్రయిస్తుంటారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఇవి ఎక్కువగా దొరుకుతుంటాయి. గిరిజనులకు ఆర్థిక లబ్ధి చేకూర్చే పంటల్లో ఇది కూడా ఒకటి. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడని పంటగా ఈ ప్రాంత సీతఫలాలకు పేరు ఉంది. దీంతో మైదాన వ్యాపారులు వీటికి అధిక ధర ఇచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు అటు ఒడిశా ప్రాంతంలోని భువనేశ్వర్, కటక్, పూరి, పర్లాకిమిడి ప్రాంతాలకు... విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు వంటి పట్టణాలకు ఎగుమతి అవుతుంటాయి.

ఎన్నో ప్రయోజనాలు

గిరిజనులు వారపు సంతకు తీసుకువచ్చే ఒక్కో సీతాఫలం కేటు(ట్రే) ధర రూ.700 నుంచి రూ.900 వరకు పలుకుతోంది. సీతాఫలాలతో మంచి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి శ్రీనివాసరావు. వీటిలో ఎ, బి, కె విటమిన్‌లతో పాటు ప్రోటీన్లు, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, కాపర్, ఫైబర్, ఇనుము వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. విటమిన్-ఏ ఉండడం వల్ల మనుషుల్లో కంటిచూపుతో పాటు చర్మం, కురులు ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. శరీరంలో చెడు కొలస్ట్రాల్‌ను బయటకు పంపి అధిక బరువును తగ్గిస్తుందన్నారు. కడుపు ఉబ్బరం, అజీర్తి, అల్సర్ వంటి జీర్ణ సంబంధిత సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని చెప్పారు. గుండె జబ్బులు, అధిక రక్తపోటు దరిచేరవని వివరించారు. మలబద్ధకం, చర్మానికి తగిలిన గాయాలు తొందరగా నయం చేయడంలో ఈ పండు ప్రత్యేకమైనదని తెలిపారు. డయాబెటిస్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుందని, చర్మంపై మొటిమలు రాకుండా కాపాడుతుందని తెలిపారు.



సీతాఫలాలను విక్రయానికి తీసుకెళుతున్న గిరిజనులు

మార్కెటింగ్ లేక...

గిరిజన గ్రామాల్లో సీతాఫలాలకు కనీస మార్కెటింగ్ సదుపాయం లేని పరిస్థితి కొనసాగుతోంది. వారపు సంతలు లేదా తమ వద్దకు వచ్చే వర్తకులకే వాటిని విక్రయించుకోవలసిన దుస్థితి నెలకొంది అందువల్ల స్థిరమైన ధర లేకుండా ఎప్పటికప్పుడు డిమాండ్ ఆధారంగానే విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ అనుభవాలే పాఠాలుగా గిరిజన రైతులు సీతాఫలాల చెట్ల పెంపకాన్ని చేపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పండిస్తున్న సీతాఫలాల సాగుకు ప్రోత్సహించడంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచి... ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన రైతులు, యువతను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.



కుసిమి సంతలో సీతాఫలాలను అమ్మకానికి తీసుకువచ్చిన గిరిజనులు

సీతారాములకు ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సోమవారం సీతారాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యాగశాలలో సుదర్శనాష్టకం, సుందరకాండ, ఆదిత్య హృదయం, సుదర్శన కవచం, హవనంలను అర్చకులు నిర్వహించారు. ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని జరిపించారు. ఈ పూజా కార్యక్రమాలను దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగపల్లి ప్రసాద్, పవన్ కుమార్, రామ్‌గోపాల్ తదితరులు పూజలు నిర్వహించారు.

బతికేదెలా?

● పాల సేకరణ ధర తగ్గింపుపై పాడి రైతుల అసంతృప్తి
● పెరిగిన దాణా, పశుగ్రాసం ధరలతో ఖర్చులు తడిసి మోపెడు
● విశాఖ డెయిరీ నిర్ణయంతో మరింత నష్టం
● ఇప్పటికే రాయితీలలో కోత



కొమరాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ సంస్థ తగ్గించడంపై జిల్లాలో పాడి రైతులు మండిపడుతున్నారు. ఆవు పాలను లీటరుకు సుమారు రూ.3 నుంచి రూ.5 వరకు తగ్గిస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పశుగ్రాసం, దాణా, ఇతర ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో ఆదుకోవాల్సింది పోయి.. ఇదేం నిర్ణయమని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ ఇస్తున్న ధరలే గిట్టుబాటు కావడం లేదు. ఇప్పటికే పాడి రైతులకు ఇచ్చే బోనస్‌లు తగ్గించారు. చనిపోయిన రైతు కుటుంబాలకు ఇచ్చే రాయితీలను కూడా కుదించారు. పశు పెంపకం భారమైన ఈ పరిస్థితుల్లో పాల సేకరణ ధరలను తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వారు పాల సేకరణ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వాస్తవంగా జిల్లాలో రోజూ సుమారు 40 వేల లీటర్ల వరకు విశాఖ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. లీటరు పాలు రూ.35 ఇస్తున్న డెయిరీ వినియోగదారులకు మాత్రం రూ.80కు విక్రయిస్తోంది. అయితే రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతున్న రైతులకు మాత్రం గిట్టుబాటు కావ డం లేదు. తాజాగా డెయిరీ తీసుకున్న నిర్ణ యంతో తాము తీవ్రంగా నష్టపోనున్నట్లు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల సేకరణ ధరతో పాటు ఇతర రాయితీలపై కోతలు అమలు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతు న్నారు. కాగా ధర తగ్గింపుపై ఈ నెల 29నగాజువాకలో నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నట్లు ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు కె.అజయ్‌కుమార్ తెలిపారు.

ఖర్చు పెరిగింది

పశుగ్రాసంతో పాటు దాణా తదితర ఖర్చులన్నీ భారీగా పెరిగాయి. దీంతో పశువుల పెంపకం భారమవుతోంది. కానీ పాల సేకరణ రేటు మాత్రం తగ్గించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పాడి రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. యాజమాన్యం వైఖరి మారకుంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోక తప్పదు.

- రాయుడు, పాడి రైతు, కొమరాడ



న్యూస్ బాక్స్

నగరపాలక సంస్థకి వినతులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమానికి ఏడు వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వివరిస్తూ, అర్జీలను కమిషనర్ నల్లనయ్యకు అందజేశారు. నగర ప్లానింగ్‌కు సంబంధించి మూడు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రెండు, రెవెన్యూ, ఇంజినీరింగు విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ శ్రీనివాసరావు, ఏవో మూర్తి, డీఈ మణికుమార్ పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరిస్తా

చీపురుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా డీలర్ల సంఘ ప్రతినిధులు గద్దేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫీఎఫ్, బీమా వంటి పథకాలు తమకు వర్తింపజేయాలని వారు తమ వినతిపత్రంలో కోరారు. త్వరలో జరగనున్న బోర్డు సమావేశంలో డీలర్ల సమస్యలను ప్రస్తావిస్తానని గద్దే హామీ ఇచ్చారు. రాష్ట్ర డీలర్ల మాజీ అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు తదితరులున్నారు.

దోషిని కఠినంగా శిక్షించాలి

విజయనగరం టౌన్: అభం శుభం తెలియని మూడున్నరేళ్ల చిన్నారిపై అకృత్యానికి పాల్పడిన దోషిని కఠినంగా శిక్షించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. గంట్యాడ మండలంలో చిన్నారిపై జరిగిన లైంగిక దాడిని ఆయన తీవ్రంగా ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. కేసును త్వరితగతిన విచారించి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఆయన సూచించారు.

కళింగ కోమటి సమస్యల పరిష్కారానికి కృషి

చీపురుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న కళింగ కోమటి వైశ్యుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని పట్టణానికి చెందిన షిరిడీ సాయి ఆలయ ధర్మకర్త, కళింగ కోమటి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగుడు రామకృష్ణ అన్నారు. ఈ నెల 27న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర సర్వ సభ్య సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీకంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో స్థానం సంపాదించిన రామకృష్ణను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

రేపు జాబ్‌మేళా

గజపతినగరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రేవాడ సత్య నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల యువతీ, యువకులు ఉదయం 9గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

వీధిలైట్లు వెలగడం లేదు

గుర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతలపేటలో రాత్రిపూట వీధిలైట్లు వెలగడం లేదని గ్రామ సర్పంచ్ పతివాడ భాస్కరరావు మండల అభివృద్ధి అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో వీధిలైట్ల సమస్య ఉన్నప్పటికీ కరెంట్ సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అటవీ ఉద్యోగుల కార్యవర్గం ఏకగ్రీవం

విజయనగరంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో సోమవారం జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.మనోజ్ (ఎఫ్ఎస్‌వో- పార్వతీపురం), కార్యదర్శిగా కేవీఎస్ రాజు (ఎఫ్ఎస్‌వో- ఆండ్ర), ఉపాధ్యక్షులుగా ఎం.భారతి(ఎఫ్‌బీవో- కుమిలి), సభ్యులుగా పలువురు ఎన్నిక య్యారు. ఎన్నికైన సభ్యులను ఇన్‌చార్జి డీఎఫ్ వో ప్రసూన, ఎఫ్ఆర్‌వో అప్పలరాజు అభినందించారు.

రైతులకు చెక్కుల పంపిణీ

జామి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేట సహకార సంఘ సీఈవో గడిచిన కొద్దిరోజులుగా రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం రవాణా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం, వీటిపై పలుమార్లు మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు అడిగినా స్పందించకపోవడంతో సదరు సీఈవోపై పోలీస్‌లకు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో సదరు సీఈవో దిగివచ్చి సొసైటీ పరిధిలో వున్న 34మంది రైతుల చెక్కులను మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పెదబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలని, అన్ని మండలాల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తిని కోరారు. డీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని సోమవారం భీశెట్టి బాబ్జీ ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

మెలకువలు పాటించాలి

వంగర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో మెలకువలు పాటించి విద్యార్థులకు సులువుగా వివరించాలని ఎంఈవో దుర్గారావు సూచించారు.

రబీకి సాగు నీరు విడుదల చేయాలి

మద్దువలస ఆయకట్టు రైతుల విన్నపం ▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 220 అర్జీలు ▸ స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం, కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు సాగునీరు విడుదల చేయాలంటూ మద్దువలస ఆయకట్టు రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని జి.సిగడాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాలకు చెందిన రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే రబీసీజన్‌కు సాగునీరు విడుదల చేయాలని కోరారు.

● వారసత్వంగా తన భర్త పేరున ఉన్న భూమిని తన పేరున మార్పు చేయడానికి అధికారులు కాళ్లరిగేలా తిప్పుతున్నారంటూ వేపాడ మండలం దబ్బిరాజపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు టి.మంగమ్మ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకున్నారు. తాను నాలుగుసార్లు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, అధికారులు తిరస్కరించారని, దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నానన్నారు. వెంటనే అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

● దత్తిరాజేరు మండలం పెదమానాపురం పశువుల సంతకు అక్రమంగా లైసెన్స్ మంజూరు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని ఏపీ గో సంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అతి పెద్ద సంత నుంచి, పశువులను కొనుగోలు చేసి లారీల్లో కుక్కి కబేలాకు పంపిస్తున్నారన్నారు. ఈ సంతలో మౌలిక సదుపాయాలు లేకపోయినా లైసెన్స్ రెన్యూవల్‌కు కొంతమంది అధికారులు ఎన్‌వోసీ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

220 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 220 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 161, డీఆర్‌డీఏకు 12, జిల్లా పంచాయతీ అధికారికి 12, గ్రామ వార్డు సచివాలయం శాఖకు 9, నగరపాలక సంస్థకు 7, విద్యాశాఖ 5, వైద్య ఆరోగ్య శాఖకు 4, డీసీహెచ్ఎస్‌కు 3, ఈపీడీసీఎల్ కు 3 వినతులు వచ్చాయి.

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

▸ ఎస్పీ వకుల్ జిందాల్

▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 32 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, అక్టోబరు 28: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి.. తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలకు సంబంధించి 6, కుటుంబ కలహాలకు సంబంధించి 2, మోసాలకు పాల్పడినట్టు 8, ఇతర విషయాలకు సంబంధించి 6 ఫిర్యాదులు వచ్చాయన్నారు. స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐ లీలారావు, రాజేష్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లోనూ బాలికలు సత్తాచాటాలి



బాలికను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో కూడా బాలికలు సత్తా చాటాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'క్రీడల్లో మెరిసి...జాతీయ స్థాయికి ఎగసి' అనే శీర్షికన వెలువడిన వార్తకు స్పందించి కొట్టక్కి పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రొంగళి మౌనికకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా క్రీడల్లో మంచి ప్రావీణ్యం సాధించి పేరుప్రఖ్యాతలు పొందాలన్నారు. ఎల్లప్పుడూ తనవంతు సహాయం అందిస్తానని తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రావాడ భాస్కరరావు, పీఈటీ బొత్స రత్నకిశోర్, టీడీపీ నాయకుడు ముల్లు రాంబాబు, ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు

● మంత్రి ఆదేశంతో డీఈ పరిశీలన

సాలూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూర్మరాజుపేట పంచాయతీ పరిధిలో పుణికిలవలస గిరిజన గ్రామంలో పలువురు గిరిజనులకు వేలాది రూపాయలల్లో విద్యుత్ బిల్లులు వచ్చాయి. దీంతో గిరిజనులు బెంబేలెత్తారు. పలువురికి రూ.7వేలు, రూ.10వేలు, రూ.15వేల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది అందించారు. బిల్లులు చెల్లించలేదని కొందరి విద్యుత్ కనెక్షన్లు కూడా నిలిపివేశారు. ఇదిలా ఉండగా సోమవారం చిన్నవలస-పుణికిలవలస రోడ్డు శంకుస్థాపనకు సోమవారం వచ్చిన మంత్రి సంధ్యారాణికి గిరిజనులు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. ఆమె అక్కడక్కడే స్పందించి ఏపీఈపీడీసీఎస్ డీఈ రంగారావు ఫోన్ చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్లే..

పుణికిలవలసలో పలువురి గిరిజనులు గతంలో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు అందించకపోవడం వల్ల సమస్య ఉత్పన్నమయినట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ రంగారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. పుణికిలవలస గ్రామాన్ని పరిశీలించి అందరికీ విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. 2022లో జరిపిన సర్వేలో కుల ధ్రువీకరణ పత్రాలు అందించకపోవడం వల్ల కొందరికి ఉచిత విద్యుత్ అందడం లేదన్నారు.

గిరిజనులపై పాలకుల నిర్లక్ష్యం

బెలగాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజన సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం తగదని గిరిజన సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం రంజిత్ మాట్లాడుతూ అనసభద్ర, కురుపాం ఏకలవ్య పాఠశాలలో గిరిజన విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహించారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. భవనాలు పూర్తి చేసి కొత్త భవనాలలోకి విద్యార్థులను తరలించాలన్నారు. గిరిజన డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విజయనగరంలో ఓపెన్ హౌస్

విజయనగరం, క్రైం అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం గవర్నమెంటు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీస్ అమరవీరు వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాల్ స్కూల్ విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ, విధులు, విధానాలపై అవగాహన కలిగించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: అదితి



వినతులు స్వీకరిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఇందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. నగరంలోని 50 డివిజన్లలోని ప్రజల నుంచి దశలవారీగా ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా వినతులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె సోమవారం మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దశలవారీగా, ప్రాధాన్య క్రమంలో ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఫిర్యాదులన్నిటినీ ఇప్పటికే సంబంధిత విభాగాలకు పంపించామని, ప్రభుత్వ నిబంధనలు అనుసరించి, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాస రావు, రాజేష్‌వర్మతో పాటు, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

'మా డబ్బులు ఏమయ్యాయి?'



మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మహిళలు

బొబ్బిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని అప్పయ్యపేట గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి పొదుపు మహిళా సంఘానికి చెందిన నిధులలో అవకతవకలు జరిగినట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. సంఘానికి చెందిన మహిళలు రెడ్డి ఉష, బూర్లి రమణమ్మ, పిన్నింటి రాజేశ్వరి తదితరులంతా సోమవారం స్థానిక మెప్మా కార్యాలయానికి వచ్చి ఆరా తీశారు. తమ సంఘానికి చెందిన నిధులు దుర్వినియోగమయ్యాయని, తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమ సంఘంలోని మహిళా సభ్యులందరికీ 66 వేల రూపాయల చొప్పున పది లక్షల రూపాయల మొత్తం బ్యాంకు రుణం మంజూరైందన్నారు. అయితే ఈ నిధుల విషయంలో సంఘం నిర్వాహకులు దుర్వినియోగానికి పాల్పడడంతో తామంతా నష్టపోయామని వారు వాపోయారు. వడ్డీ రాయితీ కింద ప్రతీ సభ్యురాలికి 1700 రూపాయల చొప్పున మంజూరైనప్పటికీ సకాలంలో చెల్లింపులు జరపని కారణంగా ఆ డబ్బులు తమ ఖాతాల్లోనికి జమకావడం లేదని వారన్నారు. సంఘం ఆర్థిక కార్యకలాపాలపై దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

రికవరీ సక్రమంగా జరగక వడ్డీ రాయితీ రాలేదు

అప్పయ్యపేట మహిళా పొదుపు సంఘం తీసుకున్న రుణమొత్తాలు సక్రమంగా జమ కాకపోవడంతో వడ్డీ రాయితీ సభ్యులకు అందలేదు. బ్యాంకు వడ్డీ రాయితీని నిలుపుదల చేసింది. దీనిపై ఆరా తీసి తగిన చర్యలు తీసుకుంటాం. బకాయిలున్న వారి నుంచి వసూలు చేయిస్తాం. ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటాం.

-జగన్మోహన్, టీపీఆర్వో, మెప్మా, బొబ్బిలి

ప్రతి ఒక్కరూ ఆర్థికంగా రాణించాలి



జామిలో ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం జామిలో పీఎంఈజీపీ పథకం ద్వారా ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ఆటోలను ఆమె అందించారు. పోలిపర్తి స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు, వర్రి రమణ, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, ఎంపీడీవో నీలంనాయుడు తదితరులున్నారు.

ఫీజుల దోపిడి అరికట్టాలి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహారాజ కళాశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థి సంఘ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ సేవ చేయాలనే లక్ష్యంతో పీవీజీ రాజు గతంలో కళాశాలలో ఏర్పాటు చేస్తే, ఇప్పుడు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, రాజు, సోమేష్; సుస్మిత, గుణ; రాహుల్ తదితరులు ఉన్నారు.



రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

విజయనగరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా సోమవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడారు. పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 312 యూనిట్లు రక్తాన్ని రక్తనిధి కేంద్రాలకు అందించామ న్నారు. ఏఎస్పీ సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, వైద్యులు మహేష్, ప్రవీణ్ కుమార్, రవి, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

● గరివిడి: చీపురుపల్లి డీఎస్పీ ఎం.రాఘవులు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో నియోజకవర్గస్థాయి రక్త దాన శిబిరం సోమవారం నిర్వహించారు. 110 మంది దాతలు ముందుకు వచ్చి తమ రక్తాన్ని దానం చేశారు. చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, గరివిడి, చీపురుపల్లి ఎస్ఐలు లోకేశ్వ రరావు, దామోదర్‌రావు, పలువురు స్వచ్ఛంద సభ్యులు హాజరయ్యారు. ● బొబ్బిలి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమ వారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 154 రక్తం యూనిట్లను సేకరించారు. రక్తదాత లను బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీని వాస రావు, సీఐ కటకం సతీ ష్‌కుమార్ అభినందిస్తూ వారందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు.



బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంట్యాడ మండలం కోటారుబిల్లి జంక్షన్ వద్ద ఈనెల 27వ తేదీన మూడున్నర సంవత్సరాల బాలికపై జరిగిన లైంగిక దాడి జరిగింది. దీనిపై సమాచారం అందిన వెంటనే విజయనగరం మహిళా పీఎస్‌లో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విజినిగిరి రవి(31)ని అదుపులోకి తీసుకున్నామన్నారు. దీనిపై విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్షపడే విధంగా అన్ని సాంకేతిక ఆధారాలు, సాక్షాలు సేకరించారన్నారు. మైనర్ బాలికకు అన్ని వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఈ కేసును ప్రత్యేక పోక్సో కోర్టు ద్వారా వేగంగా ప్రాసిక్యూట్ చేసి నిందితుడికి కఠిన శిక్ష పడే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

దత్తిరాజేరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఒక వ్యక్తి మృతి చెందినట్టు విజయనగరం రైల్వే ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మానాపురం గేటు సమీపంలో గజపతినగరం, కోమటిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుంకలాం గ్రామానికి చెందిన నేమాని సత్యనారాయణ(37) మృతి చెంది పడిఉన్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయ నగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

వంగర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాంలో సోమవారం సాయంత్రం 6 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. గ్రామంలో నాటు సారా అమ్మకాలు జరుపుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని, ఒక వ్యక్తి వద్ద ఆరు లీటర్లు సారా లభ్యం కావటంతో అరెస్టు చేసి పాలకొండ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

సాగునీటి కోసం వెళ్లి మృత్యుఒడిలోకి..

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్టలి గ్రామానికి చెందిన కనుముల జగన్మోహన్‌రావు (47) అనే రైతు ఆదివారం సాయంత్రం వరి పంటకు సాగునీరు కట్టేందుకు వెళ్లి మృత్యు ఒడిలోకి వెళ్లాడు. వివరాల్లోకి వెళితే.. తోటపల్లి ఏడో బ్రాంచి ద్వారా అట్టలి తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. దీంతో చేసేది లేక జగన్మోహన్‌రావు ఆదివారం సాయంత్రం గెడ్డ నుంచి సాగునీటిని పంట పొలానికి మళ్లించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన గుండెపోటు వచ్చి మృతి చెంది ఉంటాడని బంధువులు పేర్కొంటున్నారు. రాత్రి ఏడు గంటలు అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పంట పొలానికి వెళ్లి చూడగా జగన్మోహన్‌రావు విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఆయనను గ్రామంలోకి తీసుకొచ్చి సోమవారం ఉదయం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈయనకు భార్య మౌనిక, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురం గ్రామానికి చెందిన అక్కమచెరువులో కొత్తవలస ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు ఆధ్వర్యంలో 1000 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. సోమవారం సాయంత్రం సీఐ, ఎస్ఐ రమ్యశ్రీ, రాజు దాడులు చేశారు. చెరువులోని మారుమూల ప్రాంతంలో 4 ప్లాస్టిక్ డ్రమ్ముల బెల్లం ఊటను నిల్వ చేశారని, ఆ ప్రాంతంలోకి అతి కష్టం మీద వెళ్లి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడులలో సిబ్బంది టి.వీర్రాజు, ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిపై చర్యలేవీ?



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఫర్నీచర్‌తో పాటు అనేక వస్తువులను తీసుకుపోయిన మున్సిపల్ సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. కార్మికులకు పనిముట్లు, యూనిఫాం, భద్రతా సౌకర్యాలు, టవల్స్ తక్షణం ఇవ్వాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియే బకాయిలు చెల్లించాలని కోరారు. ఆప్కాస్ ద్వారా రిటైర్‌మెంట్ అయిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించా లని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వ భూములను అమ్మేసుకుంటున్నారు

వేపాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అప్పగించిన డీ ఫారం భూములను లీజు పేరుతో తీసుకుని అమ్మేసుకుంటున్నారని వీలుపర్తి, వెల్దాం గ్రామాలకు చెందిన పలువురు రైతులు తహసీల్దార్ రాములమ్మకు వినతి పత్రం అందజేశారు. వీలుపర్తి, వేపాడ గ్రామాల రెవెన్యూ పరిధిలో సుమారు 70 ఎకరాల డీ పట్టా భూములను భీమవరానికి చెందిన భోసురాజు అనే ఆసామి రైతుల వద్ద నుంచి లీజుకు తీసుకున్నారని, ఈ వ్యవహారంలో గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలు మధ్య వర్తిత్వం వహించి లీజులు రాయించారని, ఇప్పుడు తీరా అభూములను వెరొక కంపెనీకి ఎకరం రూ..11లక్షలు రేటు నిర్ణయించుకొని అమ్మేస్తున్నాట్టు తమకు తెలిసిందని గ్రామానికి చెందిన గోకాడ అప్పలనాయుడు, గోకాడ నర్సిబాబు, వేపాడ అన్నపూర్ణ, కంబాల ముత్యాలు, గోకాడ కృష్ణంనాయుడు, యేడువాక దేముడు, పచ్చికూర శ్రీరాం, గుండి పార్వతి, లక్కవరపు శంకర్ తదితరులు ఆరోపిస్తున్నారు. బోసు రాజు రాయించుకున్న లీజు కాలం పూర్తి అయినప్పటికి మాభూములను మాకు అప్పగించకుండా బోద్రా అనే సంస్థకు రూ.11 లక్షలకు అమ్మకం చేస్తున్నారని వారు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి ప్రభుత్వ, డీ ఫారం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టి అర్హులైన నిరుపేద రైతులకు ఆ భూములను తిరిగి అప్పగించి ఆదుకోవాలని కోరుతున్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ ఈ విషయమై జిల్లా అధికారులకు నివేదికను అందించడంతో పాటు భూముల అమ్మకాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి తగు న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బాణసంచా తాత్కాలిక షాపులను పరిశీలిస్తున్న ఆర్డీవో

రాజాం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటుకానున్న బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి స్పష్టం చేశారు. రాజాం-చీపురుపల్లి రోడ్‌లో నిర్వహిస్తున్న రెండు శాశ్వత షాపులను, కొత్తగా ఏర్పాటు చేయనున్న ఆరు తాత్కాలిక షాపులను సోమవారం ఆమె పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను గుర్తు చేశారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే మందుగుండ సామగ్రి అమ్మాలని అలా కాకుండా ఎవరైనా అమ్మకాలు చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాజాం రైల్వేలైన్‌పై దృష్టి పెట్టండి

రాజాం: రాజాం నియోజకవర్గం రైల్వేలైన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. సోమవారం విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సీఎం రమేష్ అభినందన సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ముందుగా ఆయనను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాజాం రైల్వే లైన్ విషయంలో ఇటీవల కదిలిక వచ్చిందని, ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విలీనం లేదిక!

(ఐదో పేజీ తరువాయి)

బాగువలస, మిర్తివలస, కొత్తవలసలో స్కూళ్లు ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయి.

వృథాగా భవనాలు

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద కోట్లాది రూపాయలతో పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. అయితే జీవో 117తో ఆయా పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు తరలించారు. దీంతో నాడు-నేడు కింద నిర్మించిన స్కూల్ భవనాలు వృథాగా మారాయి. సాలూరు మండలంలో శివరాంపురం, పాచిపెంట మండలం కొత్తవలస, మిర్తివలస ప్రాథమిక పాఠశాలల్లో భవనాలే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఏదేమైనా విద్యావ్యవస్థలో మార్పుల ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి..

జీవో 117 రద్దు అనేది వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది. దీనికి సంబంధించి ఆదేశాలు వస్తే మార్గదర్శకాలు ప్రకారం చర్యలు చేపట్టనున్నాం. విలీన ప్రక్రియను రద్దు చేస్తే 3,4,5 తరగతులు పూర్వ పాఠశాలలకు వెళ్లనున్నాయి.

- బి. రాజకుమార్, డిప్యూటీ డీఈవో, పార్వతీపురం మన్యం

నిర్ణయం సముచితం

జీవో 117ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. ఈ జీవో కష్టనష్టాలను వివరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం వల్ల పాఠశాలలకు పూర్వ వైభవం రానుంది.

- ఏజీఎస్ గణపతి, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు

పీజీఆర్ఎస్‌కు 190 వినతులు

సీతంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 190 వినతులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా రహదారులు, మంచినీటి సౌకర్యం, కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవనాల మంజూరు కోసం గిరిజనులు నుంచి వినతులు వచ్చాయి. వీటిలో పాటు స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యుత్ సమస్య, రహదారి సమస్యపై విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డిగ్రీ కళాశాలకు త్రీఫేస్ కనక్షన్ ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు, ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు కె.చలపతిరావు, డీఎంహెచ్‌వో విజయపార్వతీ, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ రామచంద్రరావు పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

పార్వతీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు(పీజీఆర్ఎస్) వచ్చే అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో జి.కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో 106 మంది అర్జీదారులు తమ సమస్యలను సబ్ కలెక్టర్, డీఆర్‌వోకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ

బెలగాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడమే ధ్యేయమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 8 ఫిర్యాదులు అందినట్టు ఆయన తెలిపారు. ఎక్కువగా నకిలీ పత్రాలు, కుటుంబ తగాదాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ ప్రకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురికి పీజీ హెచ్ఎంలుగా పదోన్నతి

సీతంపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పీజీ హెచ్ఎంలుగా పదోన్నతి పొందిన ఐదుగురికి ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం కౌన్సిలింగ్ జరిపి, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు. సీతంపేట బాలికల పాఠశాలకు వసంత లక్ష్మి, పీఎల్‌పురం పాఠశాలకు మురళి, ఎస్ఎల్ పురం పాఠశాలకు ఎస్వీ వర ప్రసాద్, దోనుబాయి పాఠశాలకు సుకుమార్, ఎస్ఎస్‌మణుగు పాఠశాలకు టి.అబ్బాయి పదోన్నతి పొందారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర, డీవైఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబు, సీఎంవో, జీసీడీవో హెచ్ఎంలు సూర్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించాలి

సీతంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గృహ నిర్మాణాలు పూర్తికాక, బిల్లులు చెల్లించక గిరిజన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.తిరుపతిరావు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన లబ్ధిదారులకు బకాయి ఉన్న బిల్లులు చెల్లించాలని, సగంలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఆయనతో పాటు సీపీఎం నాయకుడు భాస్కరరావు ఉన్నారు.

ఎండీఎం కార్మికుల ధర్నా

బలిజిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవో శారదకు వినతిపత్రం అందించారు.

మెనూ చార్జీలు పెంచాలి

సాలూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యో తి): పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న మెనూ చార్జీలను రూ.20లకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయ సిబ్బందికి ఎండీఎం నిర్వాహకులు వినతిపత్రం అందించారు.

స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయండి

సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నవంబరు 3న జరిగే యూటీఎఫ్ స్వర్ణోతవ మహాసభలను విజయవంతం చేయాలని మండల శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి, కార్యక్రమానికి హాజరుకావాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

బెలగాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి న్యాయం చేయాలని ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఏఐటీయూసీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు నిరోధించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణను నిరోధించాలని గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ పి.బాలను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి నివేదిక అందించాలని వీఆర్వో రవికుమార్‌కు సూచించారు.

చిన్నపాటి వర్షానికే..

● రహదారులపై నిలిచిపోతున్న నీరు
● పట్టణ వాసులకు తప్పని ఇబ్బందులు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సోమవారం ఉదయాని కి శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, సౌందర్య థియేటర్ రోడ్డు వీధి, ఎస్ఎన్‌సీ, తదితర కాలనీల్లో వరదనీరు ప్రవ హించింది. దీంతో ఆయా కాలనీవాసులు, వాహన చోదకు లు ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు వర్షం పడినా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి కారణం ఇక్కడ వరదనీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువల నిర్మాణం లేకపోవడమే. వరదనీటి మళ్లింపునకు చర్యలు చేపట్టాలని ఆయా కాలనీవాసులు ఇప్పటికే ఎమ్మెల్యేకి, అధికారులకు కోరారు.



శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీలో వరదనీటి నుంచి వెళ్తున్న విద్యార్థులు

చెరువు కాదండీ..

ఇక్కడ చూస్తున్నది చెరువు కాదండీ బాబు.. పార్వతీ పురం పట్టణంలోని గణేష్ నగర్ కాలనీ. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీరంతా ఇక్కడ వచ్చి చేరింది. సుమారు 15 ఏళ్ల కిందట ఏర్పడిన ఈ కాలనీలో ఇప్పటికీ కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో వరదనీరు ఎక్కడదక్కడ నిలిచిపోతోంది.



గణేష్ నగర్ కాలనీ మధ్యలో నిలిచిన వరదనీరు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సాలూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు కళాశాలల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు పండు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో యూనివర్శిటీని ఏర్పాటు చేయాల ని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్లను వర్కర్లును ఏర్పాటు చేయాలని కోరారు. అనంత రం డీటీ వి.రంగారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. ● సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతూ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన అనంతరం ధర్నా నిర్వహించిన నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాలూరు, కురుపాం: ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మెస్ చార్జీలు పెంచాలి

కురుపాం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వసతి దీవెన బకాయిలను విడుదల చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం.శివ, రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రావాడ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వసతిగృహం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు రమణమ్మకు వినతిపత్రం అందజేశారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

బలిజిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. విద్యార్థులంతా తహసీల్దార్ కార్యాలాయినికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యుడు కె.డేవిడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఆర్వోగా సాయిబాబు

పార్వతీపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా పి.సాయిబాబును ప్రభుత్వం నియమించింది. ఇటీవల నియామకమైన ఎ.రవీంద్రరావు స్థానంలో సాయిబాబును నియమించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే సాయిబాబు బాధ్యతలను స్వీకరించనున్నారు.

జనసేనలో చేరికలు

మక్కువ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దబ్బగడ్డ పంచాయతీ నగుళ్ల దబ్బగడ్డలో జనసేన పార్టీ మండల నాయకుడు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది గిరిజనులు సోమవారం జనసేనలో చేరారు. గిరిజన నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మక్కువ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, కార్మికుల వేతనాన్ని పెంచాలని కోరారు. అనంతరం ఎంఈవో సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి

బెలగాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధతో చదివి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో డి.మంజుల వీణ అన్నారు. సోమవారం స్థానిక జీజే కళాశాలలో ప్రిన్సిపాల్ రామారావు ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె కళాశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థుల ప్రోగ్రెస్‌పై విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఎక్స్‌రే ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షలు విలువైన ఈ ప్లాంట్ ఏర్పాటుతో నాణ్యమైన ఎక్స్‌రేలు తీయడానికి అవకాశం కలనుందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నాగభూషణరావు తెలిపారు.

తప్పెటగుళ్లు కళాకారులను గుర్తించాలి

వీరఘట్టం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడకెల్ల గ్రామానికి చెందిన తప్పెటగుళ్లు కళాకారులు సోమవారం ఎం.రాజపురం గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలిశారు. తమకు పింఛన్లు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించిచారు. సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదకాపు వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చురుగ్గా జరగాలి



పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గం పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరగాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం జియ్యమ్మవలసలో టీడీపీ మండలాధ్యక్షుడు పల్ల రాంబాబు అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె తో పాటు మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేశ్, దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా తాగునీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వీధి దీపాల నిర్వహణ ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని, అధికారులు కార్మికులతో పనిచేయించుకోలేని పరిస్థితికి బాధాకరమన్నారు. అలాగే పారిశుధ్య నిర్వహణ కూడా పూర్తి స్థాయిలో గాడిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజారోగ్య శాఖాధికారులదేనని అన్నారు. ఆయా శాఖాల అధికారులు, కార్మికులు పట్టణాభివృద్ధికి సంబంధించి అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పోలీసులకు వైద్య శిబిరం

బెలగాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బెలగాంలోని పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పోలీసులకు వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఏఎస్పీ దిలీప్ కిరణ్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పార్వతీపురం ఏఎస్పీ అంకితసురాన కలిసి ప్రారంభించారు. పలువురు పోలీసులు, యువకులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పోలీసులకు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, పాలకొండ కమిటీ కార్యదర్శి సంజీవి, కోశాధికారి వేణు అన్నారు. ఈ మేరకు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కరోనా కాలంలో పనిచేసిన 23 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రమాద మృతులకు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

4న వీఆర్ఏల ధర్నా

కురుపాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి నవంబరు 4వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు జిల్లా వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు తెలిపారు. సోమవారం వీఆర్ఏలు 4వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనున్నట్టు తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు.

● సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వచ్చే నెల 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టబోయే ధర్నా కార్యక్రమంలో వీఆర్ఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి సూరయ్య, ఎస్.జోగులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సీతంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం పెద్దపొల్ల సచివాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వ హించారు. పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. సమస్యల పరిష్కారంలో మండలాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● భామిని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం భామిని మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తూరు, బత్తిలి ఏబీ రహదారి పనులు టెండర్లు అయ్యాయన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఎలా బదిలీలు చేశారని ఎంపీడీవో చంద్రరావుకు ప్రశ్నించారు. మూడు రోజుల్లోనే బదిలీపై సిబ్బంది వస్తున్నారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కన్వీనర్ ఆర్.కిరణ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



భామిని: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గుణుపూర్ టు శబరిమలై

● పాలకొండ చేరిన అయ్యప్పస్వాముల పాదయాత్ర

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుణుపూర్ నుంచి శబరిమలైకు పాదయాత్ర చేస్తున్న వి.శ్రీనివాస స్వామి, జువ్వాది వెంటరమణస్వామి, కన్నస్వామి రాజేంద్ర బెహరా అనే ముగ్గురు అయ్యప్పస్వాములు పాలకొండలోని ఏలాం జంక్షన్‌కు సోమవారం చేరుకున్నారు. వీరిని అఖిల భారత అయ్యప్పస్వాములు ప్రచార కార్యదర్శి ఎస్.రుద్ర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తమ సన్నిదానంలో సత్కరించా రు. రుద్రకోటేశ్వరరావు మాట్లాడుతూ ముగ్గురు స్వాములు ఈనెల 26న గుణుపూర్ నుంచి బయలుదేరి 1,750 కిలో మీటర్లు పాదయాత్ర చేసుకుంటూ శబరిమలైకు చేరుకోవ డానికి వీరు తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు.



అయ్యప్ప స్వాములను సత్కరిస్తున్న దృశ్యం

రెండు చోరీ కేసుల్లో నలుగురి అరెస్టు

ఒడిశా

రాయగడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత నెల 21, 25 తారీఖుల్లో టికిరి పోలీసుస్టేషన్ పరిధి ఉపర్‌కొడింగ, జముగుడ గ్రామల్లో జరిగిన రెండు చోరీలకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టికిరి పోలీసులు నలుగురు నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. దీనికి సంబంధించి ఎస్డీపీవో రష్మిరంజన్ సేనాపతి సోమవారం వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నిందితులు 21వ తేదీ రాత్రి రమాసాహు ఇంట్లో, 25వ తేదీ రాత్రి నిరుపమ చౌదురి ఇంట్లో రేకులు విరిచి లోనికి చొరబడ్డారు. కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు టికిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. టికిరి పోలీసుస్టేషన్ పరిధి వివిధ గ్రామాలకు చెందిన ఓగులు అలియాస్ ప్రపులపాణి, లోకనాథ్ సాహు, రమేష్‌హియాల్, ప్రశాంతకులుషికలు గుర్తించారు. నిందితుల నుంచి రూ.7,500 నగదు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, బాధితులకు అప్పగించారు. నిందితులు చోరీ కోసం ఉపయోగించిన కత్తులు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టుకు తరలించారు.